# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

# Bullet Edition

గురువారం, 11 జూలై 2024 www.prajaaswaram.com 2PM


## మాజీ మంత్రి మల్లారెడ్డికి మరో షాక్



హైదరాబాద్, జూలై 10 (ప్రజాస్వరం): ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ ను వీడారు. 15 మంది కార్పొరేటర్లు. దీంతో ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ బలం మరింత పెరిగింది. త్వరలోనే ఫిర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం కానుంది. అయితే, ఈ 15 మంది కార్పొరేటర్లతో డిప్యూటీ మేయర్ శివకుమార్ ఆధ్వర్యంలో గోవాలో క్యాంప్ రాజకీయం నడుపుతున్నారు. మొన్న జవహర్ నగర్, నిన్న బోడుప్పల్ కాంగ్రెస్ కైవసం అయ్యాయి.అదే బాటలో ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కూడా హస్తగతం కానుంది. ఇదిలాఉండగా.. ఎమ్మెల్యే లే పార్టీలు మారుతున్న వేళ కార్పొరేటర్లు సైతం తామెంత అనుకుంటూ బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరుతున్నారు. ఇక్కడ మరో ప్రచారం కూడా జరుగుతోంది. గత కొంత కాలంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరిగింది. ఇటీవల కాలంలో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. ఇలాంటి తరుణంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 15 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్లారెడ్డే వెనుక ఉండి ఇదంతా నడిపిస్తున్నారా?అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.




## నీట్ కౌన్సిలింగ్‌కు ఏర్పాట్లు

### పరీక్షను తిరిగి నిర్వహించలేం

### 24 లక్షల మంది విద్యార్థులపై భారం పడుతుంది

### అత్యున్నత న్యాయస్థానంలో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్

న్యూఢిల్లీ, జూలై 11 (ప్రజాస్వరం): నీట్ యూజీ కౌన్సిలింగ్ జులై మూడో వారంలో నిర్వహిస్తామని, పరీక్షను తిరిగి నిర్వహించలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈమేరకు సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ లో అక్రమాలు, అవకతకలు జరిగినట్టు దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టిన మర్నాడే కేంద్రం తన నిర్ణయం వెల్లడించడం గమనార్హం. నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ అయిన విషయం వాస్తవమేనని, పరీక్ష సమగ్రతను దెబ్బతీశారని నిర్ధారణ అయినా లేదా నేరం చేసిన వారిని గుర్తించలేకపోయినా తిరిగి తాము పరీక్ష నిర్వహణకు ఆదేశిస్తామని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.ఫలితాల సమగ్ర విశ్లేషణలో పెద్ద ఎత్తున అవకతవకలు జరగలేదని లేదా స్థానిక అభ్యర్థులు లబ్ధిపొందినట్లు ఆధారాలు లేవని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్ లో కేంద్రం పేర్కొంది. మళ్లీ పరీక్ష నిర్వహించే ఉద్దేశం లేదని కూడా తన వైఖరిని పునరుద్ఘాటించింది. నిరాధారమైన అనుమానాల ఆధారంగా పరీక్షను రద్దుచేస్తే మే 5న పరీక్షకు హాజరైన దాదాపు 24 లక్షల మంది విద్యార్థులపై భారం పడుతుందని అభిప్రాయపడింది. నీట్-యూజీ కౌన్సెలింగ్ ప్రక్రియను జూలై మూడో వారం నుంచి నాలుగు దశల్లో ప్రారంభించాలని భావిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఏ అభ్యర్థి అయినా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే, వారి ప్రవేశాన్ని రద్దుచేస్తామని వివరించింది. అవకతవకలు, పేపర్ లీకేజీని దృష్టిలో ఉంచుకుని పరీక్షను మళ్లీ నిర్వహించాలని కొందరు పిటిషనర్లు డిమాండ్ చేయగా, మరికొందరు పరీక్షను రద్దుచేయవద్దని పిటిషన్ వేశారు.నీటీ యూజీ డేటాపై ఐఐటీ మద్రాస్ నిపుణులు సాంకేతిక విశ్లేషణను నిర్వహించారని, సామూహిక మాల్ ప్రాక్టీస్ లేదా పెద్ద సంఖ్యలో అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చే సూచనలు కనిపించలేదని కేంద్రం తన అఫిడవిట్ లో పేర్కొంది. విద్యార్థులు పొందిన మార్కులలో ప్రత్యేకంగా 550 నుంచి 720 వరకు పెరుగుదల ఉందని డేటా వెల్లడించింది. ఈ పెరుగుదలకు సిలబస్ లో 25% తగ్గింపు కారణమని కేంద్రం వెల్లడించింది. ఎక్కువ స్కోర్ లు చేసినవారు మాల్ ప్రాక్టీస్ కు పాల్పడే అవకాశం చాలా తక్కువ ఉందనే సూచనలు ఉన్నాయని వివరించింది.నీట్ లో అక్రమాలు జరిగాయా? లేదా? అనేది సాంకేతికత విశ్లేషణ ద్వారా తేల్చాలని ఐఐటీ మద్రాస్ కు కోరినట్టు కేంద్రం తెలిపింది. కాగా, గతంలో సమర్పించిన అఫిడ్ విట్ లోనూ ఇదే అంశాలను కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు, ఈ అంశంపై సీబీఐ విచారణ కూడా కొనసాగుతున్నట్టు అఫిడ్ విట్ లో తెలియజేసింది.మరోవైపు, లీక్ అయిన పేపర్ ఎంతమందికి చేరింది? ఎలా చేరింది? లీకేజీతో లబ్ధిపొందిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎందరి ఫలితాలను విత్ హోల్డ్ లో ఉంచారు? వీటికి సమాధానాలు కావాలని.. వీటన్నింటిపైనా సమగ్ర దర్యాప్తు జరగాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## ఏపీ గత పాలకులు

# వీరప్పన్ వారసులు..




తిరుపతి, జూలై 10 (ప్రజాస్వరం): తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనంలో తిరుమల శ్రీవారి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని విమర్శించారు. ఇతర మతస్తులకు అధికారాన్ని అప్పగించి తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేశారని మండిపడ్డారు. స్వామి వారిపై భక్తి లేనివారు నామాలు పెట్టుకుని.. స్వామికి, టీటీడీ ఆస్తులకు పంగనామాలు పెట్టారని ఆరోపించారు. గత ఐదేళ్లు వీరప్పన్ వారసుల చేతిలో టీటీడీ పాలన సాగిందని సంజయ్ అన్నారు. ఎర్రచందనం కొల్లగొట్టి వేల కోట్లను సంపాదించారని చెప్పారు. ఎర్ర చందనం స్మగ్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని... వారిని వదిలి పెట్టబోమని అన్నారు. వేంకటేశ్వరస్వామి వారి దయ, భిక్షతో కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగానని చెప్పారు.

- భక్తి లేకున్నా నామాలు పెట్టుకుని.. శ్రీవారి ఆస్తులకే నామం
- టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు
- అన్యమతస్తులకు అధికారం అప్పగించి నాశనం చేశారు
- ఏడు కొండలపై ఎర్రచందనం కొల్లగొట్టి కోట్లకు పడగలెత్తారు
- స్మగ్లర్ల భరతం పడతాం
- కేంద్రమంత్రి బండి సంజయ్
- శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విషెస్

### పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ బొకే

హైదరాబాద్, జూలై 10 (ప్రజాస్వరం): కేంద్ర మంత్రి బండి సంజయ్ పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. బండి సంజయ్ నివాసానికి బొకే, బర్త్ డే గ్రీటింగ్స్ పంపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో సహా పలువురు రాష్ట్ర ప్రముఖులు బండి సంజయ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



Anumula Revanth Reddy
Chief Minister of Telangana

తేదీ: 11-07-2024

శ్రీ బండి సంజయ్ కుమార్ గారు,

మీకు హృదయ పూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు. ప్రజా సేవలో నిమగ్నమై రాష్ట్రాభివృద్ధికి, రాష్ట్రంలో ప్రజాపాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు మీకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

మీ

(ఎనుముల రేవంత్ రెడ్డి)

శ్రీ బండి సంజయ్ కుమార్ గారు,
గౌరవ కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వర్యులు,
కరీంనగర్.

Dr. B.R. Ambedkar Telangana State Secretariat, 6th Floor, Hyderabad -500 022. Telangana State, India
Ph: (91) 40 - 24422666, 24422999


## అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ పాఠాలు



### మంత్రి సీతక్క

హైదరాబాద్, జూలై 11 (ప్రజాస్వరం): అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ పాఠాలు: మంత్రి సీతక్క రాష్ట్రంలోని అంగన్ వాడీ కేంద్రాల్లో నర్సరీ పాఠాలు బోధించనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. సీఎం రేవంత్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. మహిళా భద్రత, చైల్డ్ కేర్‌పై అధికారులతో సమీక్షలో ఆమె మాట్లాడుతూ. దేశంలోనే తొలిసారిగా చిన్నారులకు యూనిఫాంలు అందిస్తామన్నారు. అంగన్ వాడీల్లో చిన్నారుల సంఖ్యను పెంచేందుకు 'అమ్మ మాట-అంగన్ వాడీ బాట' పేరుతో జులై 15 నుంచి వారం రోజుల పాటు కార్యక్రమం చేపడతామన్నారు.

## 70 ఏళ్లు 70 అడుగులు




### 7 తలలు, 14 చేతులు


### ఖైరతాబాద్ గణేషుడి విగ్రహ నమూనా ఫైనల్

హైదరాబాద్, జూలై 11 (ప్రజాస్వరం): ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఖైరతాబాద్ వినాయకుడికి విగ్రహం ఈ ఏడాది 70 అడుగులతో రూపుదిద్దుకోనుంది. నిర్జల్ ఏకాదశి సందర్భంగా ఇప్పటికే కర్రపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సరిగ్గా వినాయకచవితికి వారం ముందు స్వామివారి విగ్రహం పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందని ఉత్సవ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది సప్తముఖ మహాశక్తి గణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు పూజలందుకోనున్నాడు ఈ మేరకు ప్రధాన శిల్పి చినస్వామి రాజేంద్రన్ సహా నిపుణులంతా ఇప్పటికే పనుల్లో వేగం పెంచారు. ఈ ఏడాది పరిస్థితుల ప్రకారం ప్రపంచ శాంతితో పాటూ అందరికీ ఆయురారోగ్యాలు కలిగేందుకు సప్తముఖ గణపయ్యను పూజించాలని చెప్పారు దివ్యజ్ఞాన సిద్ధాంతి గౌరీభట్ల విఠల శర్మ. ఆయన సూచనల మేరకు ఈ ఏడాది సప్తముఖాలతో వినాయకుడిని తయారు చేస్తున్నామని చెప్పింది ఉత్సవకమిటీ. 7 తలలు, 14 చేతులు, తలలపై నాగసర్పాలు...పీఠం అన్నీ కలిపి 70 అడుగుల ఎత్తులో భారీ లంబోదరుడు కొలువుతీరనున్నాడు. గతంలో తయారైన సప్తముఖ గణపతికి భిన్నంగా ఈ సారి విగ్రహాన్ని తయారుచేస్తున్నట్టు శిల్పి చెప్పారు. ఈ నెల 17 న నమూనా చిత్రాన్ని విడుదల చేస్తామన్నారు. ఖైరతాబాద్ గణేశుడికి 70 ఏళ్ల చరిత్ర ఉంది.. 1954లో ఒక్క అడుగు వినాయకుడిని ఉత్సవాలు ప్రారంభించారు. ఆ తర్వాత ఏడాదికో అడుగు పెంచుకుంటూ 60 అడుగులకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది 70వ సంవత్సరం కావడంతో ఏకండా 70 అడుగు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. పూర్తిగా మట్టితో తయారుచేసిన ప్రతిమను మాత్రమే ప్రతిష్టిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## సైకో లవర్.. డబుల్ మర్డర్







### ప్రియురాలిని దూరం చేశారని తల్లిదండ్రులను చంపిన ఉన్మాది

#### ప్రియురాలు, సోదరుడికి గాయాలు

వరంగల్, జూలై 10 (ప్రజాస్వరం): వరంగల్ జిల్లా చెన్నరావుపేట మండలం చింతల తండాలో దారుణం చోటుచేసుకుంది. ప్రేయసిని దూరం చేశారని ఓ యువకుడు అర్ధరాత్రి ప్రియురాలి కుటుంబంపై కత్తితో దాడిచేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేకల నాగరాజు అలియాస్ బన్నీ, దీపిక ప్రేమించుకున్నారు. ఇంట్లోనుంచి పారిపోయి పెళ్లి చేసుకున్నారు. పెళ్లైన రెండు నెలలకే దీపిక, నాగరాజుల మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో పోలీసులు, పెద్దల సమక్షంలో విడిపోయారు. దీంతో, ప్రేమించిన యువతిని తనకు దూరం చేశారనే కోపంతో నాగరాజు గురువారం తెల్లవారుజామున 1:35 నిమిషాల సమయంలో కత్తితో ఇంటి బయట నిద్రిస్తున్న యువతి కుటుంబ సభ్యులపై దాడికి తెగబడ్డాడు. యుతి తల్లి సుగుణ అక్కడికక్కడే మృతి చెందగా.. తండ్రి బానోతు శ్రీను చికిత్స పొందుతూ మృతిచెందాడు. యువతికి, ఆమె తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలుస్తున్నది.

## వేధింపులు తాళలేక యువతి బలవన్మరణం

### ప్రేమించకపోతే పరువు తీస్తామని వేధించినట్టు జడ్జికి వాంగ్మూలం

నల్లగొండ, జూలై 10 (ప్రజాస్వరం): ఆకతాయిలు వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం చింతలగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన యవతిని నిత్యం ఇద్దరు యువకులు వెంటపడి వేధించేవారు. ప్రేమించాలని, తాము చెప్పినట్లుగా వినాలని ఒత్తిడి చేసేవారు. లేదంటే ఫొటోలు సోషల్ మీడియాలో పెడతామని బెదిరించేవారు. దీంతో, తీవ్ర మనస్తాపానికిగురైన యువతి ఈ నెల 6వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ప్రాణాలు విడిచింది. ఈ ఘటనపై యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, చనిపోయే ముందు యువతి జడ్జి సమక్షంలో వాంగ్మూలం ఇస్తూ ఆకతాయిల వేధింపుల గురించి చెప్పింది. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపడుతున్నారు. నిందితులు పరారీలో ఉన్నట్టు తెలుస్తున్నది.

## మిస్టర్ తెలంగాణ దుర్మరణం



- సిద్దిపేటలో రోడ్డు ప్రమాదం
- అదుపుతప్పి ఆటోను ఢీకొట్టిన బైక్

సిద్దిపేట, జూలై 10 (ప్రజాస్వరం): సిద్దిపేటకు చెందిన ప్రముఖ బాడీ బిల్డర్, 'మిస్టర్ తెలంగాణ' మహ్మద్ సోహైల్ (23) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. బైక్ ను అతివేగంగా నడుపుతూ.. అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సోహైల్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తుండగానే ప్రాణాలు కోల్పోయాడు. 'మిస్టర్ తెలంగాణ' ఛాంపియన్ విజేతగా నిలిచిన మహ్మద్ సోహైల్ పలు రాష్ట్ర, సౌతిండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతగా నిలిచాడు.